క్లుప్తంగా

నేటి నుంచి యోగాంధ్ర పోటీలు

సైదాపురం: మండల కేంద్రం సైదాపురంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు యోగాంధ్ర పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తేదీన 10 నుంచి 18 ఏళ్లు, 19 నుంచి 35 సంవత్సరాలు కలిగిన వారికి పోటీలను నిర్వహిస్తామన్నారు. అలాగే 5వ తేదీన 35 ఏళ్లపై బడిన వారికి, 6వ తేదీన 7వ తేదీన 10 నుంచి 18 ఏళ్లు, 19 నుంచి 35 సంవత్సరాలు కలిగిన వారికి పోటీలు జరుగుతాయన్నారు. అన్ని సచివాలయాల వారీగా పోటీలను నిర్వహిస్తామని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వీధుల్లో మురుగు చూడతరమా !



వీధుల్లో ప్రవహిస్తున్న మురుగునీరు

సైదాపురం: మండలంలోని తిప్పిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని తోకలపూడి గ్రామంలో ఏ వీధిలో చూసినా పూర్తిగా పారిశుధ్యం లోపిస్తోంది. దీంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. దీనికితోడు మురుగునీటిని కూడా వీధుల్లోకి వదులు తుండడంతో అటుగా వెళ్లేటప్పుడు ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వీధుల్లోకి మురుగునీరు రాకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

బాలయపల్లి(సైదాపురం): క్యాన్సర్ వ్యాధి గురించి ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి లియోనా తెలిపారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో మంగళవారం మండంలోని పిగిలాం, కామకూరు గ్రామాల్లో పింక్ బస్సు ద్వారా ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ శాఖ అధికారుల సహకారంతో జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు హరిత, చైతన్యభాను, స్వరంచ్‌లు కృష్ణయ్య, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చర్యలు



యర్రగుంటలో ఆక్రమిత భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పెళ్లకూరు: మండలంలోని ప్రభుత్వ భూములను కబ్జా చేసినా, ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి, గ్రావెల్ తవ్వకాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్థానిక తహసీల్దార్ ద్వారకనాథ్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం యర్రగుంట రెవెన్యూలోని సర్వే నంబర్ 235లో ఉన్న 14.30 ఎకరాలు ప్రభుత్వ భూములను స్థానికేతరులు కబ్జా చేసినట్లు సమాచారం అందడంతో స్థానిక వీఆర్వో రమేష్, సర్వేయర్ పూజిత సంబంధిత భూములను పరిశీలించారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములు కబ్జా చేసి, లెవలింగ్ కోసం చెరువు మట్టి తరలింపు చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానికేతరులు భూకబ్జా చేసి చెరువులోని మట్టిని యంత్రాలతో అక్రమంగా తరలిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, వీటిపై పూర్తి స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

మార్కాపురం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ డిస్మిస్

మార్కాపురం: మార్కాపురం అటవీశాఖ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా (ఎఫ్ఆర్ఓ)గా పనిచేస్తున్న వరప్రసాద్‌పై వచ్చిన లైంగిక వేధింపుల కేసులో సూళ్లూరుపేట న్యాయస్థానం శిక్ష విధించిన నేపథ్యంలో అటవీ శాఖ ఉన్నతాధికారులు ఆయనను సర్వీస్ నుంచి డిస్మిస్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. వరప్రసాద్ గతంలో సూళ్లూరుపేటలో విధులు నిర్వహిస్తున్న సమయంలో మహిళా ఉద్యోగిని పై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న అభియోగాలపై ఈ ఏడాది ఏప్రిల్‌లో న్యాయస్థానం ఆయనకు శిక్ష విధించింది. ఈ నేపథ్యంలో వరప్రసాద్‌పై నేరం రుజువై శిక్ష ఖరారు కావడంతో ఆయనను ప్రభుత్వ విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తూ అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంత రాము పేరుతో మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది.

ప్రజలకు కూటమి వెన్నుపోటు

- కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా సూపర్‌సిక్స్‌కు దిక్కులేదు
- హామీల అమలుపై ప్రశ్నిస్తే కేసులు
- నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం



బాబూ ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ పేరిట సూపర్‌సిక్స్ పథకాల పట్టిక

సూళ్లూరుపేట : ప్రజలను నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబునాయుడు తనకు తానే సాటి అని మరోమారు రుజువు చేసుకుంటున్నారు. గత ఎన్నికల్లో గెలిచేందుకు అలివికాని హామీలు ఇచ్చారు. అధికారం చేపట్టాక హామీలను పక్కన పెట్టి ప్రతిపక్షాలపై దాడికి దిగుతారు. సంపద సృష్టిస్తా అని చెప్పి.. అధికారం చేపట్టిన రోజు నుంచి ప్రకృతి సంపదను దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు కూటమి నేతలు. 2019 ఎన్నికలప్పుడ ఏవైతే హామీలు ఇచ్చారో.. ముఖ్యమంత్రిగా నాడు అధికారం చేపట్టగానే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో పాటు మరిన్ని అమలు చేసి సంక్షేమ పాలన అందించారు. ఒక్క సూళ్లూరుపేట నియోజకవర్గంలోనే డీబీటీ, నాన్ డీబీటీ కింద రూ.2,200 కోట్లు ప్రజలకు సంక్షేమ పథకాల రూపంలో అందజేశారు.

మూడు పార్టీలు కూటమిగా ఏర్పడి..

2024 ఎన్నికల నాటికి టీడీపీ, బీజేపీ, జనసేన మూడుపార్టీలు కూటమిగా ఏర్పడి లెక్కకు మించి హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు. కానీ అధికారం చేపట్టిన ఈ సంవత్సరం కాలంలో ప్రజలకు మంచి చేయకపోగా.. నిత్యం ప్రజలకు సేవలందించే వలంటీర్ వ్యవస్థను, ఇళ్ల వద్దకే వచ్చి రేషన్ సరుకులు అందించే బండ్లను రద్దు చేశారు. సచివాలయ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నారు. అయితే సూపర్ సిక్స్‌లో తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, మహిళలకు ఉచిత ప్రయాణం, నిరుద్యోగ భృతి, మూడు సిలిండర్లు, రైతులకు పెట్టుబడి సాయం వంటి సంక్షేమ పథకాల అమలుకు నిధులు లేవు అంటూ సాకులు చెబుతున్నారు.

నట్టేటా ముంచేస్తున్నారు..



ఎన్నికలకు ముందు రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పారు. మరి సంవత్సరం కాలం గడిచిపోయినప్పటికీ ఇప్పటి వరకు పెట్టుబడి సాయం ఇవ్వకపోగా ధాన్యానికి మద్దతు ధర లేకుండా చేశారు. ఈ ఏడాది రైతులు బాగా నష్టపోయారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి పెట్టుబడి సాయం కింద రూ.15 వేలు ఇస్తే.. దానికి మరో రూ.5 వేలు పెంచి రూ.20 వేలు ఇస్తామంటే తనలాంటి రైతులంతా నమ్మి ఓట్లేస్తే ఇప్పుడు నట్టేట ముంచేస్తున్నారు.

– సుంకర అల్లియ్య సీపీఎం నాయకులు, సూళ్లూరుపేట

చేయలేనప్పుడు ఎందుకు చెప్పాలి ?



ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేనపుడు ఎందుకు నమ్మించి మోసం చేయాలి ? రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీ అని తెలుసు కదా! 2019 జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు ఇచ్చారు కదా ! 2024 ఎన్నికల సమయంలో నెరవేర్చలేని హామీలు ఎందుకివ్వాలి ? వీటికి డబ్బు ఎలా వస్తుందనే విషయం అప్పుడు తెలియదా ? ఇప్పుడు డబ్బులు లేవని చెప్పడం ఏంది ?

– చెంగేణి సుధాకర్‌రెడ్డి, సీపీఐ నాయకులు

నమ్మించి ఓట్లేయించుకున్నారు



మహిళలను నమ్మించి ఓట్లేయించుకుని ఇప్పుడు మోసం చేయడం సబబు కాదు. మహాశక్తి పేరుతో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలి. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇవ్వాలి. ప్రతి మహిళకు మూడు సిలిండర్లు ఇవ్వాలి. తల్లికి వందనం కింద చదువుకునే ప్రతి బిడ్డకు రూ.15 వేలు ఇవ్వాలి. ఇవన్నీ ఇవ్వలేనపుడు మహిళలకు ఎందుకు చెప్పారో ముఖ్యమంత్రి గారు సమాధానం చెప్పాలి.

– ముంగర అమరావతి, సూళ్లూరుపేట

అమ్మఒడికి ఏడాదిగా ఎదురు చూపులు



అప్పుడే పాఠశాలలు ఆరంభం అవుతున్నాయి. ఈ టైంలో పిల్లలను బడికి పంపాలంటే ఖర్చులు ఉంటాయి. గతంలో అమ్మఒడి పథకం ద్వారా వచ్చే డబ్బులతో స్కూల్‌కు పంపగలిగేవాళ్లం. ఈ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు తల్లికి వందనం ఇస్తామన్నారు. నేటికీ అందలేదు. ఇలా అయితే బిడ్డలను బడికి పంపడం కష్టమే.

– శారదమ్మ, విద్యార్థి తల్లి, వాకాడు,

పెట్టుబడి సాయం ఎక్కడ ?



గత ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందించేది. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా నేటికీ ఒక్క రూపాయి కూడా రైతులకు సాయం అందించలేదు. దీనికితోడు రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు రాయితీపై అందించే వారు. అది కూడా నేడు లేదు.

– వరప్రసాద్‌రాజు, రైతు, సైదాపురం

ఇంటి కోసం ఎదురు చూస్తున్నా..



ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అవుతుంది. అప్పటి నుంచి పేదలకు పక్కా గృహాలు అందించేందుకు జాబితాలు సిద్ధం చేస్తున్నామని అంటున్నారే తప్ప ఇప్పటి వరకు అతీగతీ లేదు. గత ప్రభుత్వంలో నివేశ స్థలం ఇచ్చినా అందులో ఇల్లు మంజూరు చేయలేదు.

– అంకమ్మ, గృహిణి, విద్యానగర్, కోట మండలం

ఎప్పటి నుంచి అమలు చేస్తారో ?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా ఇప్పటి వరకు ఉచిత బస్సు ప్రయాణంపై స్పష్టమైన హామీ ఇవ్వలేదు. అలాగే ఎప్పటి నుంచి అమలు చేస్తారనే విషయం చెప్పడం లేదు.

– పత్రి మస్తానమ్మ, గృహిణి, గునపాడు, చిట్టమూరు మండలం

నిరసన ర్యాలీని విజయవంతం చేద్దాం



నాయకులతో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిల్లకూరు: రాష్ట్రప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక చేతులెత్తేసి వెన్నుపోటు పొడిచిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ చేపడుతున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి భారీఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పిలుపు నిచ్చారు. గూడూరు పట్టణంలోని సనత్‌నగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గూడూరు టవర్ క్లాక్ నుంచి ర్యాలీగా బయలుదేరి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలసి నిరసన వ్యక్తం చేస్తూ వెళ్లి సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించనున్నారు. సమావేశంలో నాయకులు సవంత్‌కుమార్‌రెడ్డి, నందవరం సుబ్బారావు, సుబాన్, పూర్ణచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 39.878 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 39.878 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఇన్‌చార్జి ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు. కండలేరు నుంచి సత్య సాయి గంగ కాలువకు 2160, పిన్నేరుకాలువకు 10, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

హామీల అమలుపై ప్రశ్నిస్తే కేసులా?

- కూటమి ప్రభుత్వం హామీలను విస్మరించి ప్రజలను వెన్నుపోటు పొడుస్తోంది
- కూటమి నేతలు ఇంటింటికీ వెళ్లే ధైర్యం ఉందా ?
- నేడు రాపూరులో వెన్నుపోటు దినోత్సవం
- నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారం చేజిక్కించుకున్నా ప్రజలకు ఇచ్చినా ఒక్క హామీ అయినా కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినప్పటికీ ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోగా ప్రజలను మోసం చేశారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రతిపక్ష పార్టీగా తమ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, తాము ప్రశ్నిస్తుంటే పచ్చమీడియా వక్రీకరిస్తోందని, మరోవైపు కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. అందుకే తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో వెన్నుపోటు దినోత్సవం నిర్వహించి నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలియజేశారు. ఇందులో భాగంగా వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రాపూరు పడమర వీధిలోని శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయం దగ్గర నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టి తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు. ఇందుకు సంబంధించి అనుమతులకు స్థానిక పోలీసులకు ముందస్తుగానే సమాచారం అందించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కాభాను ప్రియ, పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, విప్ పూజారి లక్ష్మి, కౌన్సిలర్లు కళ్యాణి, వహిద, రాధ, సుకన్య, ఎంపీ నారాయణ, సుబ్బారావు, శ్రీనివాసులు, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి హరికృష్ణ, మహిళా విభాగం అధ్యక్షురాలు రామతులసి పాల్గొన్నారు.

మండల కన్వీనర్‌కు పరామర్శ



పాదర్తి హరినాథ్‌రెడ్డిని పరామర్శిస్తున్న నేతలు

నాయుడుపేటటౌన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓజిలి మండల కన్వీనర్ పాదర్తి హరినాథ్ రెడ్డిని మంగళవారం పలువురు నాయకులు పరామర్శించారు. నాయుడుపేట పట్టణంలోని వారి ఇంటి వద్ద హరినాథ్‌రెడ్డి ప్రమాదవశాత్తు కింద పడి గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ముస్లిం మైనారిటీ విభాగ కన్వీనర్ షేక్ షబ్బీర్, నాయకులు ముత్యాల రెడ్డి, తన్నమాల రమణయ్య, సుబ్రహ్మణ్యం యాదవ్ తదితరులు పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

రేషన్ 'భారం'



రేషన్ సరుకులు తీసుకుపోతున్న మహిళలు

సైదాపురం: రేషన్ సరుకులు తెచ్చుకోవడానికి ప్రజలకు తిప్పలు మొదలయ్యాయి. రేషన్ షాపు తెరచి ఉందా ? డీలర్ వచ్చాడా ? అని పలువురు తమ ఇళ్లలోని చిన్నారులను పంపుతున్నారు. ఆపై దుకాణం తెరచి ఉందంటే.. మరొకరిని తోడు తీసుకుని వెళ్తున్నారు. దూరాభారం ఉండడంతో ఇంట్లో ఒకరు పని మానుకుని రేషన్ దుకాణానికి వెళ్లి పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అక్కడ సర్వర్ పని చేయకపోతే సాయంత్రం రండీ అంటూ డీలర్లు నింపాదిగా చెబుతున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి రేషన్ కష్టాలు మొదలయ్యాయి. మంగళవారం కూడా మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు రేషన్ సరుకులు తీసుకోకుండానే కొందరు తిరుగుముఖం పట్టారు. మరికొందరు మాత్రం ఒకరిని వెంటబెట్టుకుని వెళ్లి సరుకులు తెచ్చుకున్నారు.

నేడు వెన్నుపోటు దినం

- కార్యక్రమాన్ని విజయవంతం చేయండి
- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి

నాయుడుపేటటౌన్: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. మంగళవారం ఆయన నాయుడుపేటలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా సీఎం చంద్రబాబు ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారని విమర్శించారు. హామీలు అమలు చేయమని ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతూ వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తుండడాన్ని నిరసిస్తూ వినతిపత్రం ఇస్తామన్నారు. అనంతరం అక్కడ నుంచి స్థానిక రెవెన్యూ కార్యాలయం వరకు భారీ నిరసన చేపడుతూ ర్యాలీగా వెళ్లి తహసీల్దారుకు వినతిపత్రం అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని కోరారు.

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేద్దాం

పెళ్లకూరు: కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుధవారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో నాయుడుపేటలో చేపట్టనున్న వెన్నుపోటు దినాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం చిల్లకూరులోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అంతా ఉదయం 8.30 గంటలకు నాయుడుపేటలోని అంబేడ్కర్ సర్కిల్ వద్దకు చేరుకోవాలన్నారు. అక్కడ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు.

వృద్ధులకు ఇంటి వద్దే రేషన్

ఓజిలి: రేషన్ కార్డు ఉండి 65 ఏళ్లపైబడిన వృద్ధులకు రేషన్ డీలర్ వారి ఇళ్ల వద్దకే వెళ్లి సరుకులు పంపిణీ చేస్తారని తహసీల్దార్ పద్మావతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వృద్ధులు రేషన్ సరుకుల కోసం దుకాణాల వద్దకు వెళ్లి ఇబ్బందులు పడవద్దని తెలిపారు. కార్డులో ఎంతమంది 65 ఏళ్ల పైబడిన వారు ఉన్నా ఇంటి వద్దకే సరుకులు పంపిణీ చేయాలన్న ఆదేశాలను రేషన్ డీలర్లు తప్పకుండా పాటించాలని సూచించారు. చౌకదుకాణ డీలర్లు నిబంధనలను పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించండి



వాకాడు బస్టాండ్‌లో పర్యటిస్తున్న సురేష్‌రెడ్డి

వాకాడు/కోట: బస్టాండులో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన వాకాడు ఆర్టీసీ డిపోతో పాటు బస్టాండు, కోట బస్టాండ్‌ను సందర్శించారు. డిపో పరిధిలోని అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే వాకాడు, కోట బస్టాండ్లలో కనీస వసతులు తాగునీరు, కరెంటు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కోట ఆర్టీసీ బస్టాండ్‌ను మోడల్‌గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. డిపో మేనేజర్ పెంచలయ్య, బీజేపీ నాయకులు ఉన్నారు.

డ్రైనేజీల్లో వ్యర్థాల తొలగింపు



విన్నమాల సప్లయ్ చానల్‌లో వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్ ఫజులుల్లా

నాయుడుపేటటౌన్ : పట్టణ పరిధిలో ఉన్న విన్నమాల సప్లయ్ చానల్(ప్రధాన డ్రైనేజీ కాలువ)లో పూడికతీత పనులు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భారీ వర్షాలు కురిస్తే వర్షపు నీరు కాలువలో సాఫీగా వెళ్లేందుకు ముందుస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు చెప్పారు. జేసీబీలతో పట్టణ పరిధిలోని పలుచోట్ల భారీగా నిల్వ ఉండిపోయిన పూడికతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను సైతం తొలగిస్తున్నట్లు కమిషనర్ వివరించారు. ప్రజలు కూడా సహకరించి ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైనేజీ కాలువల్లో పడేయకుండా సహకరించాలని కోరారు. ముఖ్యంగా దుకాణాదారులు సైతం ఇష్టారాజ్యంగా చెత్తను కాలువల్లో పడేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకుని మున్సిపల్ కార్మికులకు, లేదా చెత్తను రలించే వాహనాలు వచ్చినప్పుడు కానీ చెత్తను అందించి సహకరించాలని కమిషనర్ కోరారు.

గిరిజన సంక్షేమ సంఘం కార్యదర్శికి వినతి



మల్లికార్జునకు వినతిపత్రం సమర్పిస్తున్న గిరిజన సంక్షేమ సంఘం బృందం నేతలు

వెంకటగిరి రూరల్ : గిరిజన సంక్షేమ సంఘం ముఖ్య కార్యదర్శి మల్లికార్జున నాయక్‌ను యానాదుల సంక్షేమ సంఘం బృందం మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల చెంచు మల్లికార్జున, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మలికి చెంచయ్య మాట్లాడుతూ గిరిజనులకు ఆధార్, రేషన్‌కార్డులు, 30 కేజీల బియ్యం కార్డులు మంజూరు చేయాలని కోరారు. గిరిజన గురుకులం స్కూళ్లలోని పలు సమస్యలను వివరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నేతలు పాల్గొన్నారు.

9 గంటలన్నారు.. కనీసం 6 గంటలు ఇవ్వట్లేదు..!




సాగునీరు లేక ఎండుముఖం పట్టిన వరినాట్లు

చిట్టమూరు : ఎండకారు బోర్ల నీటి కింద మండలంలో సుమారు 5 వేల హెక్టార్లలో వరి సాగు అయింది. కొత్తగుంట సబ్ స్టేషన్ పరిధిలో ఆరూరు ఫీడర్ కింద తాడిమేడు, ఆరూరు, రాఘవవారిపాళెం, నార్తువరత్తూరు గ్రామాలకు వ్యవసాయ మోటార్లకు త్రీఫేజ్ కరెంట్ సరఫరా అవుతుంది. ప్రస్తుతం రైతులు ఈ మూడు గ్రామాల్లో 1000 ఎకరాల్లో వరి సాగు చేశారు. అయితే గత ఇరవై రోజుల నుంచి బోర్లకు త్రీఫేజ్ కరెంట్ రోజుకు 6 గంటలు కూడా సరఫరా కాకపోవడంతో నాట్లు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అది కూడా ఆగి ఆగి వస్తుండడంతో పారిన పొలమే పారుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలప్పుడేమో వ్యవసాయానికి పగలే 9 గంటలు త్రీఫేజ్ కరెంట్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు కనీసం 6 గంటలు కూడా ఇవ్వడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులకు ఫోన్ చేసి అడిగితే మెయిన్ సప్లై పోయిందని, లైన్ ట్రబుల్, వర్క్ జరుగుతోందని ఏవేవో కారణాలు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి నాట్లు వేద్దామని దుక్కులు సాగు చేసి పొలం సిద్ధం చేసుకోగా.. కరెంట్ సరిగా రాక పొలం పారక ఇబ్బంది పడుతున్నారు. మరో పక్క వేసిన వరి నాట్లు ఎండిపోతున్నాయి. పగలే 9 గంటలు ఇస్తామని చెప్పడంతో వరి సాగు చేసిన తమను కూటమి ప్రభుత్వం నిండా ముంచుతోందని రైతులు ఆరోపిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని దర్గా వీధిలో ఉన్న హజరత్ సయ్యద్ హషీమ్ హుస్సేనీ రహమతుల్లా అలై దర్గాలో మంగళవారం రాత్రి గంధ మహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధల నడుమ నిర్వహించారు. దర్గా ముస్లిం వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఇంటి నుంచి మత గురువుల ప్రార్థనలతో గంధాన్ని దర్గా వద్దకు చేర్చారు. అనంతరం బాబా సమాధికి గంధం పూసి, అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కులమతాలకు అతీతంగా తిరుపతి, చెన్నై, నెల్లూరు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా విచ్చేసి గంధం స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మత గురువులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత



సాయం అందిస్తున్న సభ్యులు

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని పిచ్చిరెడ్డి తోపు వీధిలో నివాసం ఉంటున్న పసుపులేటి తిరుమల(55) ఆరోగ్యం బాగలేక మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో బలిజ చేయూత ఫౌండేషన్ వారు మృతుడి కుటుంబానికి మంగళవారం రూ.10 వేల నగదు అందించారు. మట్టి ఖర్చులకు కొంత నగదు సైతం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.